క్లుప్తంగా...

నేడు విద్యుత్ అంతరాయం

మేడ్చల్: విద్యుత్ స్తంభాలకు అడ్డుగా ఉన్న చెట్ల తొలగింపు పనుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ తెలిపారు. పూడూర్ 33/11 కేవీ పరిధిలో మరమ్మతుల కారణంగా మునీరాబాద్ ఏజీఎల్ సర్వీస్, రామరాజు పాల్లీ, ఎస్‌కే లాజిస్టిక్స్, పూడూర్ ఏజీఎల్ సర్వీస్‌ల పరిధిలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

కొనసాగుతున్న సెలక్షన్స్

శామీర్‌పేట్: తూముకుంట మున్సిపాలిటీ పరిధి హకీంపేటలోని స్పోర్ట్స్ స్కూల్‌లో రాష్ట్ర స్థాయి సెలక్షన్స్ కొనసాగుతున్నాయి. తెలంగాణ రాష్ట్ర క్రీడా పాఠశాలలో 4, 5వ తరగతి ప్రవేశాలకు శుక్రవారం విద్యార్థులకు ఫిజికల్, మెడికల్ టెస్టులు నిర్వహించారు. సెలక్షన్స్‌లో నల్గొండ, భువనగిరి–యాద్రాది, సూర్యాపేట్, జనగాం జోన్ల విద్యార్థులు పాల్గొన్నట్లు ఓఎస్‌డీ వివరించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ ఆఫీసర్ రతన్‌బోస్, ప్రిన్సిపాల్ ప్రకాశ్, కోచ్‌లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నర్సరీల్లో పెంచుతున్న మొక్కలపై ఆరా



రాంపల్లిలో నర్సరీలను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లిలోని నర్సరీలను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్ పరిశీలించారు. నర్సరీల్లో పెంచుతున్న వివిధ రకాల మొక్కల వివరాలతోపాటు వాటి సంరక్షణకు తీసుకుంటున్న చర్యలను నర్సరీ నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. డీఈఈ సుదర్శనం, రఘు తదితరులు పాల్గొన్నారు.

పేద మహిళకు నిత్యావసర సరుకులు



ఘట్‌కేసర్: మున్సిపాలిటీ దళితవాడలో నివసించే ఏ దిక్కులేని నిరుపేదరాలు మాధవికి మున్సిపల్ చైర్ పర్సన్ దంపతులు పావనీయాదవ్, జంగయ్యయాదవ్ రెండు నెలలకు సరిపోనూ నిత్యావసర సరుకులు శుక్రవారం అందజేశారు. ఆమె ఇంటి ఆర్థిక పరిస్థితిని గమనించిన ఎస్సై అశోక్ సూచన మేరకు చైర్ పర్సన్ చేయూతనిచ్చారు. ఈ సందర్భంగా ఎస్సై అశోక్ మాట్లాడుతూ పేదరాలికి సాయం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నరేశ్, సిద్దు, లడ్డు, కానిస్టేబుల్ పాల్గొన్నారు.

మల్లారెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో సీసీ రోడ్డు పనులు



గుంటిగూడెంలో సీసీ పనులు ప్రారంభిస్తున్న వైస్ చైర్మన్ మాధవరెడ్డి, భద్రారెడ్డి

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలో మంత్రి మల్లారెడ్డి సొంత డబ్బుతో గుంటిగూడెంలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులు, నాలుగో వార్డులో ఈద్గా పనులను మున్సిపల్ వైస్ చైర్మన్ మాధవరెడ్డి, మల్లారెడ్డి హెల్త్‌సిటీ చైర్మన్ భద్రారెడ్డితో కలిసి శుక్రవారం ప్రారంభించారు. కౌన్సిలర్లు వెంకట్‌రెడ్డి, ఆంజనేయులుగౌడ్, మాజీ ఎంపీటీసీ గోపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, రాందాస్, స్థానికులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణానికి స్థలం కేటాయించాలి



కీసర: నాగారం మున్సిపాలిటీలో కొత్తగా ప్రభుత్వం మంజూరు చేసిన 50 పడకల ఆసుపత్రి నిర్మాణానికి సంబంధించి సుమారు 10 గుంటల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని కోరుతూ శుక్రవారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు అడిషనల్ కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి తెలిపారు. బీఆర్ఎస్ నేత వరకాల పెంటయ్యగౌడ్ తదితరులు అడిషనల్ కలెక్టర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

మహిళలకు అన్ని రంగాల్లో పెద్దపీట

మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతా లక్ష్మారెడ్డి



మాట్లాడుతున్న రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి



సునీతాలక్ష్మారెడ్డిని సన్మానిస్తూ..

సాక్షి, మేడ్చల్ జిల్లా: మహిళల రక్షణ కోసం ప్రత్యేకంగా ఉన్న చట్టాలను ప్రభుత్వం పక్కా అమలు చేస్తోందని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించడానికి పెద్దపీట వేస్తోందని పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ప్రజావాణి హాలులో మహిళా సాధికారత, గృహ హింస, ఉపాధి, ఆరోగ్యంపై ఆమె సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ప్రభుత్వం మహిళల కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసిందని, అందులో మహిళల రక్షణ కోసం 181, 100, శిశు సంరక్షణ (చైల్డ్ వెల్ఫేర్)కు 1098, సైబర్ క్రైమ్‌కు సంబంధించి 1930లకు ఫోన్ చేస్తే వెంటనే స్పందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె స్పష్టం చేశారు. ప్రత్యేకంగా పోక్సో చట్టాన్ని అమలు చేయడంతో పాటు పోష్ యాక్టు కింద అన్ని శాఖల్లో (డిపార్టుమెంట్) అమలు చేయాలని సునీతా లక్ష్మారెడ్డి సూచించారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, ఈ విషయంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. విద్యార్థినులకు ప్రత్యేకంగా కాలేజీలు, హాస్టళ్లను ఏర్పాటు చేసి ఇంటిని మరిచేలా అన్ని సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కార్పొరేట్ స్థాయిలో విద్యను అందచేయడంతో పాటు విదేశాలకు వెళ్లి చదువుకునేందుకు స్కాలర్ షిప్‌లు అందజేసిన ఘనత ఈ ప్రభుత్వానికే దక్కుతుందని తెలిపారు. మహిళల ఆరోగ్యం కోసం ఆరోగ్య లక్ష్మీ, ఆరోగ్య మహిళ, మహిళా రక్షణ, షీ టీమ్, సఖీ, భరోసా వంటి వాటి ద్వారా అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ వంటి పథకాలతో అనేక సేవలు అందిస్తున్నామన్నారు. మహిళలు గర్భం దాల్చినప్పటి నుంచి తిరిగి బిడ్డ పుట్టిన తర్వాత ఇంటికి వెళ్లేంత వరకు ఎంతో బాధ్యతగా చూసుకోవడంతో పాటు వారికి ఆర్థిక సహాయం కూడా అందజేస్తున్నామన్నారు. సమావేశానికి ముందు సునీతా లక్ష్మారెడ్డిని జిల్లా అదనపు కలెక్టర్లు విజయేందర్‌రెడ్డి, అభిషేక్ అగస్త్య, పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. సమావేశంలో జిల్లా సంక్షేమాధికారి కృష్ణారెడ్డి, డీసీపీ ఉషారాణి, డైరెక్టర్ శారద, సభ్యులు ఈశ్వరీబాయి, పడాల పద్మ, సూదం లక్ష్మీ, రేవతి, స్వయం సహాయక సంఘాల మహిళలు, మహిళా, శిశు సంక్షేమ శాఖ సిబ్బంది,సెర్ప్,మెప్మా ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష

సాక్షి, మేడ్చల్ జిల్లా : అన్ని వర్గాల మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతా లక్ష్మారెడ్డి సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాస్థాయి అధికారులతో ఆమె మాట్లాడారు. సఖీ కేంద్రానికి వచ్చే మహిళలకు వైద్య, పోలీసు, న్యాయపరంగా సంపూర్ణ సహకారాలు అందించడంతో పాటు 5 రోజుల పాటు వసతి కల్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మహిళా స్వయం సహాయక సంఘాలకు స్త్రీ నిధికి సంబంధించిన రుణాలు అర్హులందరికీ అందేలా చూడాలన్నారు. జిల్లాలో మెప్మా ఆధ్వర్యంలో 13 మున్సిపాలిటీల్లో 420 స్వయం సహాయక సంఘాలకు మహిళా ఆరోగ్య సమితి విషయాలపై అవగాహన కల్పించాలన్నారు. విద్యాసంస్థల్లో ప్రతి విద్యార్థి, మహిళా టీచర్లకు పోక్సో కేసులపై అవగాహన కల్పించాలని, ఏమైనా ఇబ్బందులు ఎదురైతే 1098కు ఫోన్ చేయాలని విద్యార్థినులకు ఉపాధ్యాయులు తెలపాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు విజయేందర్‌రెడ్డి, అభిషేక్ అగస్త్య, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, కమిటీ సభ్యులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

దేశం గర్వించేలా తెలంగాణ పోలీస్

డీజీపీ అంజనీకుమార్

మేడ్చల్ రూరల్: టెక్నాలజీ వాడకం ద్వారా నేరాలకు కళ్లెం వేస్తూ తెలంగాణ పోలీసులు దేశానికి గర్వకారణంగా నిలుస్తున్నారని డీజీపీ అంజనీకుమార్ అన్నారు. కండ్లకోయలోని పోలీస్ శిక్షణా కేంద్రానికి శుక్రవారం విచ్చేసిన ఆయన పోలీసుల గౌరవ వందనం స్వీకరించి అనంతరం మొక్కలు నాటారు. అనంతరం 40 సీసీ కెమెరాల నియంత్రణ కేంద్రాన్ని ప్రారంభించారు. కానిస్టేబుల్ నుంచి హెడ్ కానిస్టేబుల్‌గా, ఏఎస్ఐ నుంచి ఎస్ఐగా పదోన్నతులు పొందిన పోలీసులు శిక్షణ పూర్తి చేసుకోగా వారిని అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ఏర్పాటు తర్వాత పోలీస్ శాఖలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయని తెలిపారు. రాష్ట్రంలో పటిష్ట భద్రత అమలవుతుండటంతో బహుళ జాతి సంస్థలు పెట్టుబడులు, సంస్థల ఏర్పాటుకు మొగ్గు చూపుతున్నారని, సీఎం ఆదేశాల మేరకు ఉన్నతంగా సేవలు అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో 28 శిక్షణా కేంద్రాలు ఉన్నాయని, దేశంలోని ఏ రాష్ట్రంలో కూడా ఇన్ని శిక్షణ కేంద్రాలు లేవన్నారు. మేడ్చల్ శిక్షణా కేంద్రంలో హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందిన 247 మందికి, ఏఎస్ఐ నుంచి ఎస్సైగా పదోన్నతి పొందిన 82 మంది శిక్షణ పూర్తి చేసుకున్నారని, మరో 442 మంది మహిళా పోలీసు అధికారుల శిక్షణకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. పోలీస్ ట్రైనింగ్ ఐజీ తరుణ్ జోషి, పీటీసీ ప్రిన్సిపాల్ మధుకర్ స్వామి, ప్రిన్సిపాల్ మధుకర్ స్వామి, అడిషనల్ డీజీపీ తరుణ్‌జోషి, ప్రిన్సిపాల్ మధుకర్‌స్వామి, మేడ్చల్ ఏసీపీ వెంకట్‌రెడ్డి, డీఎస్పీలు జగన్, పిచ్చయ్య, లక్ష్మి, విజయ్‌కుమార్, లక్ష్మీకాంత్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు వెంకట్‌రెడ్డి, సూర్యానారయణ, ఏఓ రామారావు తదితరులు పాల్గొన్నారు.



కండ్లకోయ పీటీసీలో శిక్షణ పొందిన పోలీసులతో డీపీజీ, ఐజీ

ర్యాగింగ్ రహిత అనురాగ్ యూనివర్సిటీకి కృషి చేయాలి



ప్రతిజ్ఞ చేయిస్తున్న సీపీ డీఎస్ చౌహాన్, డీసీపీ జానకి

రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్

ఘట్‌కేసర్: అనురాగ్ యూనివర్సిటీని ర్యాగింగ్ రహిత క్యాంపస్‌గా మార్చడానికి విద్యార్థులు కృషి చేయాలని రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ పిలుపునిచ్చారు. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మండలం వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ (ఏయూ)లో ర్యాగింగ్, డ్రగ్స్ నిర్మూలనపై శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సుకు సీపీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ర్యాగింగ్, డ్రగ్స్ వాడకం, ఈవ్ టీజింగ్, ధూమపానం వంటి దురలవాట్లకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రమాణం చేయించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ విద్యార్థుల భవిషత్‌ను నాశనం చేస్తుందని అన్నారు. యువత ఇంటర్నెట్, సోషల్ మీడియా, అపరిచిత వ్యక్తులతో దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులు కుటుంబ సభ్యులతో అధిక సమయం వెచ్చించాలని, తమ సమస్యలు పాలుపంచుకోవాలన్నారు. ఏయూ చైర్మన్, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ర్యాగింగ్ వంటి హీనమైన చర్యలకు పాల్పడకుండా కెరీర్‌పై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో మల్కాజిగిరి డీసీపీ జానకి, ఏసీపీ నరేశ్‌రెడ్డి, సీఈఓ నీలిమా, రిజిస్ట్రార్, హెచ్‌ఓడీలు విద్యార్థులు పాల్గొన్నారు.

జవహర్‌నగర్‌లో శరవేగంగా అభివృద్ధి పనులు



పనులను ప్రారంభిస్తున్న మేయర్ కావ్య, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని 6వ డివిజన్ కార్పొరేటర్ పల్లపు రవి ఆధ్వర్యంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను శుక్రవారం మేయర్ కావ్య, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ కావ్య మాట్లాడుతూ.. జవహర్‌నగర్ కార్పొరేషన్ అంతటా ప్రగతి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. గతంలో రోడ్లపై మురుగునీటితో నడవలేని దుస్థితి నెలకొందని, తెలంగాణ ప్రభుత్వ హయాంలో డ్రైనేజీ, సీసీ రోడ్లతో జవహర్‌నగర్ ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. మంత్రి మల్లారెడ్డి సహకారంతో జవహర్‌నగర్‌ను మోడల్ కార్పొరేషన్‌గా తీర్చిదిద్దుతానన్నారు. అనంతరం కాలనీవాసులకు మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిషనర్ రామలింగం, నాయకులు ఉపేంద్ర, పల్లపు ప్రశాంత్, జంగిటి రమేష్, జనలక్ష్మీ, మురళి, కళావతి, సత్తమ్మ, రామలక్ష్మీ, వాణి, వెంకట్‌రెడ్డి, అశోక్, మహేందర్‌చారి, విష్ణు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

డేవిడ్ సోలమన్ రాజుకు డాక్టరేట్



కీసర:భోగారంలోని హోలీమేరీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్‌లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా ఐక్యూఏసీ ఇన్‌చార్జిగా పనిచేస్తున్న ఆంధ్రప్రదేశ్ గుంటూరుకు చెందిన డెవిడ్ సోలమన్ రాజు యల్లంపల్లికి ప్రతిష్టాత్మక రాయలసీమ విశ్వవిద్యాలయం(కర్నూలు) డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ మేరకు ఆయనను కళాశాల చైర్మన్ సిద్ధార్థ రెడ్డి, డైరెక్టర్ డా.పి.భాస్కరరెడ్డి, ప్రిన్సిపాల్ డా.జె బివి సుబ్రహ్మణ్యం, ఇసిఈ హెడ్ డా.పి. రాజాప్రకాశరావు ఇతర విభాగాల అధిపతులు, హోలీ మేరీ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ సిబ్బంది అభినందించారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ఘట్‌కేసర్: మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్మికురాలు బాలమణి భర్త శుక్రవారం అనారోగ్యంతో మరణించాడు. విషయం తెలుసుకున్న చైర్ పర్సన్ దంపతులు పావనీయాదవ్, జంగయ్యయాదవ్ మృతుడి నివాసానికి వెళ్లి నివాళులర్పించారు. అంత్యక్రియల నిమిత్తం రూ.5 వేలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గోపాల్‌రెడ్డి, రవికాంత్ రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

మేడ్చల్‌రూరల్: రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తున్న విద్యార్థిని కారు ఢీకొట్టడంతో విద్యార్థిని మృతి చెందిన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ మురళీధర్ తెలిపిన వివరాల ప్రకారం శామీర్‌పేట్ మండలం యాడారం గ్రామానికి చెందిన చిట్కుల వైష్ణవి(16) ఉదయం స్నేహితులతో కలిసి బ్యాంక్ పనిపై మురహరిపల్లి ఎస్‌బీఐ బ్యాంక్‌కు వెళ్లి పనిపూర్తి చేసుకుని రాజీవ్ రహదారిపై రోడ్డు పక్క నుంచి స్నేహితులతో కలిసి నడుచుకుంటూ తిరిగి ఇంటికి వెళ్తోంది. తుర్కపల్లి నుంచి నగరం వైపు వెళ్తున్న కారు వేగంగా ఆమెను ఢీకొటి తీవ్ర గాయాల పాలైన ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. మేడ్చల్ పోలీసులు ఘటన స్థలికి చేరుకుని మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో కారు ఢీకొని..



శామీర్‌పేట్: రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి చెందిన సంఘటన శామీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మేడ్చల్ ఆర్టీసీ కాలనీకి చెందిన తోటపల్లి ప్రజన్(24) పాలమోర్ స్టీల్ కంపెనీలో పార్ట్ టైమ్ ఉద్యోగం చేస్తూ ఎంబీఏ చదువుతున్నాడు. ఎంబీఏ పరీక్ష రాసేందుడు స్నేహితుడు సింహాచలంతో కలిసి యాక్టివా ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. మేడ్చల్ నుంచి ఘట్‌కేసర్ వైపు రాజీవ్ రహదారిలో వెళ్తుండగా శామీర్‌పేట్‌లోని సెలబ్రిటీ క్లబ్ వద్ద వైనుక వైపు నుంచి వస్తున్న గుర్తు తెలియని కారు ఢీ కొట్టింది. కారుతో పాటు డ్రైవర్ పరారయ్యాడు. అతడి తలకు బలమైన గాయం తగలడంతో చికిత్స కోసం 108 అంబులెన్స్‌లో కొంపల్లిలోని శ్రీకర ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

నెల రోజుల్లో అభివృద్ధి పనులు పూర్తిచేస్తాం

గ్రామాల్లో పర్యటించిన మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్‌రూరల్: మండలంలోని పూడూర్, గోసాయిగూడ, మునీరాబాద్, రాజబొల్లారం, రాజబొల్లారం తండా, అక్బర్జాపేట్, ఘనాపూర్ గ్రామాల్లో శుక్రవారం మంత్రి మల్లారెడ్డి పర్యటించారు. ఆయా గ్రామాల్లో సర్పంచులు, నాయకులతో కలిసి వీధుల్లో పాదయాత్ర చేసిన మంత్రి స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. గ్రామాల్లోని రోడ్డు లేని ప్రతిచోటా సొంత నిధులతో సీసీ రోడ్డు, అండర్ డ్రైనేజీ పనులు చేయిస్తానని హామీ ఇచ్చారు. గ్రామాల్లో పలు ఆలయాల నిర్మాణాలు, కుల సంఘాలకు భవనాల ఏర్పాటు నిధులు విరాళంగా అందజేస్తానని హామీ ఇచ్చారు. పూడూర్, రాజబొల్లారం గ్రామాల్లో మజీదులను సందర్శించి వాటి అభివృద్ధికి సహకారం అందిస్తానని తెలిపారు. రాజబొల్లారంలో సీసీ కెమెరాలను ప్రారంభించారు. బస్టాప్ ఏర్పాటుకు పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామాలను అన్ని విధాల అభివృద్ధి పరచడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. నెల రోజుల్లో గ్రామాల్లో అభివృద్ధి పనులు పూర్తి చేస్తామన్నారు.



పూడూర్‌లో...

ఆయా గ్రామాల సర్పంచులు బాబుయాదవ్, గణేశ్, మంగ్యానాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, ఎంపీపీ రజితరాజమల్లారెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటేశ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దయానంద్ యాదవ్, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, భాగ్యారెడ్డి, ఉపసర్పంచులు వెంకటేశ్, నర్సింగ్‌రావు, నారాయణ, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



మునీరాబాద్ గ్రామంలో పాదయాత్ర చేస్తున్న మంత్రి మల్లారెడ్డి

కలెక్టరేట్ వద్ద బీజేవైఎం ఆందోళన



సాక్షి, మేడ్చల్ జిల్లా: ముఖ్యమంత్రి కేసీఆర్ గత ఎన్నికల్లో యువతకు హామీ ఇచ్చిన ప్రకారం నిరుద్యోగ భృతి ప్రతినెలా రూ.3,016 చొప్పున ఇప్పటి వరకు 56 నెలలకు సంబంధించిన మొత్తం రూ.1,68,896 వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ.. శుక్రవారం మేడ్చల్ కలెక్టరేట్ ఎదుట బీజేవైఎం కార్యకర్తలు ఆందోళన నిర్వహించారు. గ్రూపు–2 పరీక్షలు వాయిదా వేయాలని కోరారు. వందలాది మంది ప్రాణత్యాగం చేసి సాధించుకున్న స్వరాష్ట్రంలో 10 ఏళ్లు అవుతున్నా, ఉద్యోగ నియామకాలు లేకపోవడంతో నిరుద్యోగ యువత ఆవేదన చెందుతుందన్నారు. నోటిఫికేషన్ల జారీ మొదలుకొని పరీక్షలు నిర్వహిస్తున్న తీరుతోపాటు ఉద్యోగ నియామకాలన్ని తప్పుల తడక కొనసాగుతున్నాయని బీజేవైఎం కార్యకర్తలు ఆరోపించారు. దీంతో నిరుద్యోగ యువత తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని బీజేవైఎం కార్యకర్తలు ఆందోళనలో వ్యక్తం చేశారు. టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్‌ను సస్పెండ్ చేసి, అభ్యర్థుల కోరిక మేరకు గ్రూప్–2 పరీక్షలకు 3 నెలల గడువిచ్చి, ఎలాంటి లీకులు, తప్పులు లేకుండా నిర్వహించాలన్నారు. కలెక్టరేట్ వద్ద బీజేవైఎం ధర్నా, బైఠాయింపుతో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. శామీర్‌పేట పోలీసులు ఆందోళనకారులకు నచ్చజెప్పారు. బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు మోహన్‌రెడ్డి, బీజేపీ రూరల్ జిల్లా అధ్యక్షుడు పటోళ్ల విక్రమ్‌రెడ్డి, రాష్ట్ర బీజేవైఎం అధ్యక్షుడు భానుప్రకాష్, జిల్లా అధ్యక్షుడు, పవన్‌రెడ్డి, నాయకులు చల్ల ప్రభాకర్, చిత్తరంజన్‌రెడ్డి, శివ, సంతోష్, నునేముంతల రవీందర్‌గౌడ్, నల్ల వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

పతకాలు తెచ్చిన విద్యార్థులు

సాక్షి, సిటీబ్యూరో: అంతర్జాతీయ స్పోర్ట్స్ ఛాంపియన్ షిప్‌లలో తమ విద్యార్థులు విజయాలను సాధిస్తుండటం పట్ల కేఎల్ డీమ్డ్ టు బి విశ్వవిద్యాలయం యాజమాన్యం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేసింది. దక్షిణ కొరియాలో ×ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ ఛాంపియన్ షిప్ జూనియర్స్ 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మెన్ పోటీలో తమ విద్యార్థి ఉమా మహేష్ మద్దినేని కాంస్యం పతకాన్ని, థాయ్‌లాండ్‌లోని పట్టాయాలో అంతర్జాతీయ సాఫ్ట్ టెన్నిస్ ఛాంపియన్ షిప్‌లో మరో విద్యార్థి సూర్య ఆకాష్ సిల్వర్ మెడల్‌ను టర్కీలో జరిగిన జూనియర్ వరల్డ్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్‌లో తమ విద్యార్థిని షేక్ సాదియా అల్మాస్, స్వర్ణం, కాంస్యం , ఓవరాల్ సిల్వర్ పతకాలను గెలుచుకున్నారని వివరించారు.

డాక్యుమెంట్ పోయినది

సనత్‌కారి వినయ్ కుమార్ తండ్రి లేట్ సనత్‌కారి శ్రీనివాస్, వయసు సుమారు 26 సం॥లు, వృత్తి: వ్యాపారం, నివాసం: ఇం.నం. 2–37/1, రావల్‌కోల్ గ్రామం, మేడ్చల్ మండలం, మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా, తెలంగాణ అను నేను ఆరు నెలల క్రిందట మియాపూర్ నుండి రావల్‌కోల్‌కు ఇల్లు మారుతుండగా రోల్ నం. 1236149220 గల నా ఒరిజినల్ SSC లాంగ్ మెమో పోయినది. వెతికిననూ దొరకలేదు. దొరికినవారు సంప్ర: 9652863114.

పల్లె దవాఖానాను సందర్శించిన డీఎంహెచ్ఓ



పల్లె దవాఖానాను విజిట్ చేసి వివరాలు తెలుసుకుంటున్న డీఎంహెచ్ఓ

శామీర్‌పేట్: మండలంలోని లాల్‌గడిమలక్‌పేట్ గ్రామంలోని పల్లె దవాఖానా, సబ్ సెంటర్‌ను శుక్రవారం జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్ ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ ఆదేశాల మేరకు సందర్శించిన డీఎంహెచ్ఓ సెంటర్‌లోని రిజిస్టర్‌లను పరిశీలించారు. హెచ్‌టీఎన్, డీఎమ్, బీపీ మానిటర్ కోసం కాంబినేషన్ డ్రగ్స్ సరఫరా, లభ్యతపై స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేసి లబ్ధిదారుల ఇంటిలో హైపర్‌టెన్షన్ తదితర మందుల గురించి అడిగి తెలుసుకున్నారు. నాన్ కమ్యూనికేబుల్ డిసీజ్‌లపై వారి రోగులు, ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్థానిక వైద్య అధికారులు పాల్గొన్నారు.

సొంత నిధులతో అభివృద్ధి పనులు



సీసీ రోడ్డును ప్రారంభించిన సీఎంఆర్ హెల్త్ సిటీ చైర్మన్ భద్రారెడ్డి

పోచారం: అన్నోజిగూడలోని ఎల్ఎస్ కాలనీలో కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి సొంత నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును సీఎంఆర్ హెల్త్ సిటీ చైర్మన్ చామకూర భద్రారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం కాలనీలోని ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ, శివాలయం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా భద్రారెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు తనవంతు సహకారం అందజేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి, వైస్ చైర్మన్ రెడ్యానాయక్, కౌన్సిలర్లు సింగిరెడ్డి సాయిరెడ్డి, మెట్టు బాల్‌రెడ్డి, చింతల రాజశేఖర్, బి.హరిప్రసాదరావు, కోఆప్షన్ సభ్యుడు అక్రం అలీ, బీఆర్ఎస్ పోచారం మున్సిపల్ అధ్యక్షుడు మందడి సురేందర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ గొంగ్లె బాలేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపించొద్దు

మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య

ఘట్‌కేసర్: అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపించొద్దని మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య అన్నారు. మున్సిపాలిటీలోని ఒకటో వార్డులో రూ.10 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులు వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కమిషనర్ సాబేర్ అలీతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపాలిటీలో ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపడతామని, మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. సీసీ పనులు నాణ్యతతో చేపట్టాలని, లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఆంజనేయులుగౌడ్, రమేశ్, అశ్విని, చంద్రశేఖర్, అనిల్‌కుమార్, సురేశ్ పాల్గొన్నారు.